# కొత్త వెలుగు

సాయంకాలపు ఎండ తీవ్రత తగ్గి చల్లదనమావహించే సమయానికి విశ్వనాథం సరిగ్గా అక్కడికి చేరుకుంటాడు. అది ఒక పెద్ద వటవృక్షం. దానిపక్కనే మరొక వేపచెట్టు మొలిచి రెండడుగుల ఎత్తు పెరిగిన తరువాత రెండూ కలుసుకుపోయి పెద్ద మానుకట్టి ఒక వృక్షంలా కనుపిస్తాయి. ఈ పెద్ద వృక్షం నీడ పది గజాల వెడల్పున చుట్టూ ఆవరించుకుంటుంది. ఆ వృక్షం చుట్టూ రెండడుగుల వెడల్పున కూర్చునేటందుకు వీలుగా దిమ్మె సిమెంటుతో కట్టి ఉంది.

అది ఒక నవాబుగారి తోట. మధ్యలో భవనం. ఆ తోట ఊరికి చివరగా ఉంది. ఆ తోటలోకల్లా అదే పెద్ద వృక్షం. గేటుకు పదిగజాల దూరాన కుడిచేతి వైపుగా ప్రాకారానికి కొంచెం ఎడంగా ఉంది. మిగతా చెట్లు ప్రాకారం చుట్టూ ఉన్నాయి. కాని దీనంత పెద్దవి కావు, వాటికి కూడా చుట్టూ సిమెంటు దిమ్మెల కట్టడాలు ఉన్నాయి. ఒక పక్కగా పూలతోట ఉండేది కాబోలు. వాటికి నీళ్లందటానికి సిమెంటుతో కాలువలు కట్టి ఉన్నాయి. దాని పక్కగా నీటికొలను ఉంది.

ఆ తోటమధ్యన శిథిలమైన భవనం ఒకటుంది. పెద్ద దర్బారుహాలు, చుట్టు వరెండాలు, హాలు వెనుకగానూ, పక్కగానూ, నివాస యోగ్యమైన గదులూ, పెద్ద భోజనశాల కిందికి దిగిపోవటానికి మెట్లూ, భవనం వెనకగా నౌకర్లకు గదులూ, మోటారుకార్లు పెట్టుకోవటానికి గరాజులూ ఉన్నాయి.

ఒక కాలంలో ఈ భవనం అతివైభవంతో కన్నులపండువగా ఉండేదా ఊరివారికి.

కాని, ఇప్పుడవేవీ వాటి వాటి స్వరూపాలలో లేవు. పైకప్పులు, దర్వాజాలు కిటికీలూ లేవు. మొండిగోడలూ, విరిగిపోయిన మెట్లూ మనకిప్పుడు కనబడతాయి. కాని చెత్తాచెదారం తీసి ఊడ్చి చూసినట్లయితే రంగు రంగుల లతలూ బొమ్మలూ

గల పింగాణీ పలకలు పరచిన నేల. అక్కడక్కడ పెచ్చులూడిపోయి కనబడుతుంది. ఇప్పటికీ ఎవరికయినా ఇటుకలు కావాలంటే గోడలుతవ్వి తీసుకువెళ్తారు. మట్టి కావాలంటే తవ్వుకుపోతారు.

ఆ తోట యజమాని అప్పటి నవాబుగారి మనమడు. అతడు విదేశాలలో ఉంటాడు. తోటకు కాపలాగా ఒక నౌకరు కుటుంబాన్ని ఉంచాడు. కొంతకాలానికి ఆ నౌకరు చనిపోయాడు. అతడి కొడుకు కొంతకాలం పనిచేశాడు. ప్లేగుజాడ్యం ముమ్మరంగా ఉన్న కాలంలో ఆ కుటుంబం చెల్లాచెదరయిపోయింది. ఈ వార్త నవాబుగారికి అందినట్టు లేదు. అప్పటినుంచీ అది అంతా శిథిలమైపోతునే ఉంది. చాలా చెట్లు ఎండిపోయాయి. కట్టెపుల్లలుకూడా ఆ ప్రాంతంలో ఉన్నవాళ్లు తీసుకుపోతునే ఉంటారు.

విశ్వనాథానికి కీర్తనలు ప్రాక్టీసుచేసుకోవటానికి వీలైన ప్రదేశమని అక్కడికి వచ్చి, చెట్టుకింద దిమ్మెమీద ఉత్తరీయం పరుచుకుని, తల కింద రెండుచేతులూ పెట్టుకుని, గీత గోవిందంలోని శ్లోకాలు చదువుకుంటూ అరమోడ్పు కళ్ళతో పడుకుంటాడు.

అదే అతడికి విశ్రాంతినిచ్చే స్థలము. మనసుకు ప్రశాంతతను చేకూర్చే వేళ.

విశ్వనాథం ఏడుగంటలయితేగాని అక్కడి నుంచి లేవడు. ఆ తోటలో దీపాలు లేవు. ఆ తోటబైట అక్కడక్కడ ఇళ్లు ఉండటంచేత మునిసిపల్ దీపాలు మినుకు మినుకుమంటూ వెలుగుతూ ఉంటాయి. కాని చెట్ల నీడవల్ల ఆ వెలుగు తోటలోకి బాగా ప్రసరించదు. అందుకే అతడు టార్చిలైటు చేత బట్టుకునేవస్తాడు.

విశ్వనాథానిది బాల్యమునుండీ నేర్చుకున్న సంగీతం. అతడి బాల్యంలో పొరుగున ఉన్న సంగీతవిద్వాంసుడు శిష్యులకు పాఠాలు చెబుతుంటే తను కూడా వాళ్ళదగ్గర కూర్చునేవాడు. ఆ గాయకుడికి విశ్వనాథం ఇంటినుంచి భోజనంలోకి సాధకాలు లభించేవి. అతడు అన్నం మాత్రమే వండుకునేవాడు. చిన్న చిన్న దొప్పలలో పప్పు, కూర, పచ్చడి, సాంబారు పెట్టి, వాటిని గిన్నెలో అమర్చి ఒక చెయ్యి మూతగా పెట్టుకుని తీసుకువచ్చి, లోపలపెట్టి శిష్యులపక్కగా కూర్చునేవాడు. మొదట్లో సంగీతవిద్వాంసుడు అంతగా పట్టించుకోలేదు. తరువాత, తరువాత అతడి శ్రద్ధాభక్తులను చూసి, చురుకైన పిల్లవాడుగా ఉన్నాడని స్వరాలు

చెప్పటం మొదలుపెట్టాడు. అప్పడతడికి ఏడవ సంవత్సరం. అప్పటినుంచీ బి.ఏ పరీక్ష రాసేవరకూ అభ్యసిస్తునే ఉన్నాడు ఆయన దగ్గర.

మధ్యాహ్నం విద్వాంసుడు ఊళ్ళో పాఠాలుచెప్పి ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకునేవాడు. మళ్ళీ సాయంత్రము ఐదుగంటల నుండి ఏడుగంటల వరకూ పెరట్లో చాపలువేసి ఐదుమంది శిష్యులకు పాఠాలు చెప్పేవాడు. అప్పుడు కూడా విశ్వనాథం ఆయనదగ్గరికి వెళ్ళి కూర్చునేవాడు.

విశ్వనాథం ఆ యింటికి పెద్దకొడుకు. తల్లి లేనివాడు. తండ్రి తిరిగి పెళ్ళి చేసుకున్నాడు. ఐదుగురు పిల్లలలో ముగ్గురు మగపిల్లలు. అతడికి ఉన్న ఆస్తి వెయ్యిగజాల స్థలము. దానిలో నాలుగు గదుల ఇల్లు, పెరట్లో ఒక పూరిపాక, స్కూలు టీచరుగా రిటైరయిన తరువాత ట్యూషన్లమీద డబ్బు సంపాదించేవాడు. తల్లి వృద్ధురాలయినా పొయ్యిదగ్గర కూర్చుని వంటచేసేది. ఆమెకు తల్లిలేని విశ్వనాథమంటే ప్రాణం. కనుక ఆమె అతడి బాధ్యత వహించేది.

"పిల్లల చదువులు, ఫీజులు, పుస్తకాలు, బట్టలు, డబ్బు చాలదు'' అని ఘర్షణపడే భార్య భర్తల గొడవ, ఆమె పట్టించుకునేది కాదు. ఉదయంలేచి బావి దగ్గర స్నానంచేసి వంటయింట్లోకి వచ్చేది. వంటకాగానే విశ్వానాథానికి, పిల్లలెవరయినా వస్తే వాళ్ళకూ అన్నం పెట్టేది. తొమ్మిది గంటలకు విశ్వనాథం స్కూలుకు పోగాచూసి తను భోజనంచేసి పెరట్లో బాదంచెట్టు కింద ఒక నులక మంచం వేసుకుని నడుం వాల్చేది. అలిసిపోయిన మీదట వెంటనే కునుకు వచ్చేది.

ఆమెకెన్నో స్త్రీల పాటలు వచ్చు. గంగా గౌరీసంవాదం, సీత ఆనవాళ్ళు, కుశలవుల కథ, చెంచులక్ష్మి నరసింహస్వాముల వివాహం మొదలైన పాటలు పాడుతూ పెరట్లో విస్తళ్ళు కుట్టి ఆడబ్బు విశ్వనాథానికి ఫీజుకూ పుస్తకాలకూ ఇచ్చేది.

ఎప్పుడైనా కొడుకుతో ''విశ్వనాథం చదువుసంగతి పట్టించుకోవేం? వాడేం చేస్తున్నాడో తెలుసుకో" అనేది.

"నేను ఎన్నని పట్టించుకునేది? నేను వీధి అరుగుమీద ట్యూషన్లు చెబుతుంటే తొమ్మిది గంటలకు అన్నంతిని వెళ్ళిపోతాడు. సాయంత్రం చీకటిపడితేనేగాని ఇంటికి రాడు. నేను సాయంత్రం టూష్యను పిల్లలను పంపించి లోపలికి వచ్చే

టప్పటికి, పడుకుంటాడు'' అంటూ జవాబిస్తాడు తల్లికి. విశ్వనాథం బాధ్యత తనకు లేనట్టుగా.

''ఏం చదువుతున్నావురా ? నాన్న నడగరాదూ చదువు చెబుతాడు. ఎంత మందికో చెబుతున్నాడు" అని విశ్వనాథంతో ఆమె అంటే నవ్వుతాడు.

"బామ్మా, నీవు పాడతావుచూడు - "చెట్టు లెక్కగలవా ఓ నరసింహ గుట్ట లెక్కగలవా ?" చెంచులక్ష్మిని నరసింహస్వామి పెళ్ళిచేసుకుంటా నన్నప్పుడు ప్రశ్నలు వేస్తుంది చూడు ఆపాట'' అంటాడు రాత్రి పడుకునేటప్పుడు.

''నీ కెందుకురా ఆ పాట ! నీచదువు నీవు చదువుకో'' అంటూ నవ్వేస్తుంది.

బామ్మ మంచం పక్కనే తనూ ఒక నులకమంచం వేసుకుని ఆమెను చూసుకుంటూ పడుకుంటాడు. అతడు తల్లి నెరుగడు. ఆమే తల్లి అన్న భావము మనసులో పాతుకుపోయింది.

విశ్వనాథం చిన్నక్లాసు పిల్లలకు చదువుచెప్పి సంపాదించిన డబ్బుతోనూ బామ్మ విస్తళ్ళుకుట్టగా వచ్చిన డబ్బుతోను తండ్రి ప్రమేయం లేకుండానే మెట్రిక్ ప్యాసయ్యాడు. అతడు స్కూలుకు ప్రథముడుగా విజయంపొందటంవల్ల పై చదువులకు స్కాలర్‌షిప్పు వచ్చింది.

అతడి బామ్మకు పెరట్లో విశాలమైన పూరిపాక ఉంది. బామ్మతో పాటు అతడూ దానిలోనే ఉంటాడు. ఇద్దరూ ఒకరినొకరు వదిలిపెట్టి ఉండలేరు.

విశ్వనాథం ఆ చెట్టుకింద దిమ్మమీద పడుకుని కీర్తనలు ప్రాక్టీసు చేసుకుంటూ ఉంటే, ఆ ప్రశాంత వాతావరణంలో, ఆ కిన్నెరకంఠం మంద్రస్థాయిలో తీగెలు సాగుతూ ఉంటే, ఏదో లోకంలోకి పోతున్నట్టుంటుంది. అతడి పాటలు వినడానికి ఆ చుట్టుపక్కల పిల్లలూ పెద్దలూ వస్తూ ఉంటారు.

''ఏంపాట ! ఏంపాట !''

"ఈ సామి ఎక్కడోడు ?"

రెండు మూడు కీర్తనలుపాడి అతడు టార్చి చేతపట్టుకొని, ఉత్తరీయం

బుజమ్మీదవేసుకుని లేచేసరికి వాళ్లు వెళ్తారు. వెళ్తూ "సామీదణ్ణం" అనుకుంటూ సాగిపోతారు. అతడు కూనిరాగాలుతీస్తూ అడుగులువేస్తాడు. రాత్రిళ్లు బామ్మ భోజనం చెయ్యదు గ్లాసెడుమజ్జిగతాగి ఒక అరటిపండుతింటుంది. ఒక అరటిపండు దారిలో కొని జేబులోవేసుకుని నడుస్తాడు.

అతడు బి. ఏ. పరీక్ష రాయగానే ప్రిన్సిపల్ పిలిచి ''విశ్వనాధం ఈ డిసెంబరులో మన టైపిస్టు రిటైరవుతాడు. నీవు ఒక్క నిమిషమయినా వృదా చెయ్యకుండా టైప్‌రైటింగ్ షార్టుహాండ్ నేర్చుకో. నిన్ను ఆ పోస్టులోపెట్టిస్తా మన కాలేజికి కంప్యూటర్‌కూడా వస్తుందట" అన్నాడు.

విశ్వనాధానికి గురువులే సర్వస్వం.

పైకి నిదానంగాకనబడినా విశ్వనాధంలో చురుకుదనం, పెద్దలపట్ల భక్తి గౌరవాలు, వినయం ఉన్నాయి. తనకుచెప్పినపని ఐదు నిమిషాలకంపె ముందుగా చేసి చేతికందిస్తాడు. ఈ సంగతి కాలేజి స్టాఫ్‌కందరికీ తెలుసు. అతడిని చూడగానే ఆకర్షణ కలుగుతుంది ఎవరికయినా.

అందుకే అతడు విద్యార్థిఅయినా ఆ కాలేజికి జీవనాడిలా ఉంటాడు. అతడిని సంప్రదించనిదే ఏ పనీ జరగదు.

''బామ్మా, ఈ రెండువందలూ నాన్నకియ్యి'' అంటూ బామ్మ చేతిలో పెడతాడు. ఈ రూపాయలసంచీ భద్రంగాదాచు నేనడిగినప్పుడు ఇద్దువుగాని'' అంటూ ఒకనెలలో అటూ ఒకనెలలో ఇటూ ఇస్తూఉంటాడు.

అప్పుడప్పుడు బామ్మకు ఆమె కట్టుకునే బట్టలుతెస్తాడు. ఎప్పుడైనా తను కొనుక్కుంటాడు. తను ఇస్త్రీబట్టలు తీసుకుని గడపదాటిన తరువాత-అరుగుమీద కూర్చుని, బూట్లు వేసుకుంటాడు.

"పిడికెన్ని తెలుసు? రంగూ బిడ్డూ పొడుగూ గుణం అంతా తాతగారే. ఆ తల్లికి చూసుకునే ప్రాప్తంలేదు" అనుకుంటుంది.

తొమ్మిది గంటలవుతూనే ''బామ్మా వెళ్ళుతున్నా'' అంటాడు.

''నాయనా క్షేమంగావెళ్ళి లాభంగారా'' అని ఎంతపనిలో ఉన్నా గడప వరకూ వచ్చి సాగనంపుతుంది.

విశ్వనాధానికి సంగీతం వచ్చినట్టు కాలేజిలో ఎవరికీ తెలియదు. విద్యార్థిగా ఉండగా వార్షికోత్సవాలలో అమ్మవారిమీద ఒక దండకం చదివాడు ప్రార్థనగా.

ఆ రాగం ఎత్తుకోవటంతోనే అలలు అలలుగా పైకి పైపైకిలేచి వినేవాళ్ళ మనసులనుకూడా వెంట తీసుకువెళ్ళి, ఎట్లా పైకివెళ్ళిందో అట్లా కిందికిదిగివచ్చింది. ప్రార్థన ఆగిపోగానే అందరూ అప్పుడే ఒళ్ళుతెలిసినట్లుగా కళ్ళుతెరిచారు.

మైమరపించే ఆ కంఠం, గుక్కతిప్పుకోకుండా సాగిన రాగం క్రమంగా పాదం చివరకు వచ్చేటప్పటికి తగ్గి మళ్ళీ హెచ్చుస్థాయిలోకి పోవటం ఏ శ్రోత మర్చిపోగలడు?

స్కూలు తరువాత కాలేజికివచ్చినా శ్యామలాదండకం-కాళిదాసు నోటి వెంటఅనుగ్రహించిన అమ్మవారిని చూడగానే వెలువడిన దండకం "మాణిక్య వీణాముపలాలయంతం మదాలసాం మంజుల వాగ్విలాసాం, మహేంద్ర నీలద్యుతి కోమలాంగీం మాతంగ కన్యాం మనసాస్మరామి..........."

ఉద్యోగం చిన్నదయినా హోదా తక్కువైనా విశ్వనాధానికి అమితగౌరవం తెచ్చిపెట్టిందీ ప్రార్థనా దండకం. శ్రోతలను అధికంచేసింది. ఈ నాటికీ అదొక ఆచారంగా విశ్వనాధం బాధ్యతగా మారింది ప్రార్థన కాలేజీలో.

ఒక సందర్భంలో విదేశాలనుండి ఒక ప్రొఫెసరు భారతదేశంలోని వింతలూ విశేషాలను, గుడిగోపురాలు వాటిమీద శిల్పకళనూవిని ఉత్తర దక్షిణ భారతాలను విహంగ వీక్షణంగా చూడటానికి బయలుదేరివచ్చాడు. అది విశ్వనాధం ఉంటున్న ఊరు కావటం అతడి అదృష్టం.

ప్రొఫెసరు తిన్నగా పోస్టాఫీసుకువెళ్ళి గుడిగోపురాలు, కళాశాలల ఎడ్రసు తెలుసుకుని కాలేజికి ముందుగావెళ్లాడు. ప్రొఫెసరు విజిటింగ్‌కార్డు చూడగానే ప్రిన్సిపల్ గడగడలాడుతూ బైటికివచ్చి రెండు చేతులతో ఆయనకు షేక్‌హేండిచ్చి సగౌరవంగా తనగదిలోకి తీసుకువెళ్ళాడు కాఫీ తెప్పించి ఇచ్చాడు.

ప్రొఫెసరు ముందుగా తన పరిచయంచేసుకుని తాను వచ్చినపని చెప్పాడు. తనకు గైడుగా ఒక లెక్చరర్‌ని ముఖ్యంగా చారిత్రక విషయాలు తెలిపిన లెక్చరర్‌ని తనతో పంపమని అడిగాడు.

"నేను మీకు అన్నీ వివరంగా చూపించగలను" అంటూ ప్రిన్సిపల్, ప్రొఫెసరు ఎక్కివచ్చిన టాక్సీలో ఇద్దరూ బయలుదేరివెళ్లారు.

"ఇదిగో ఇదే పెన్నానది. ఇది ఎప్పుడు పొంగిపొరలుతుందో, ఎప్పుడు నీరు వస్తుందో చెప్పటం కష్టం. నీరు తగ్గినప్పుడు ప్రజలు నడిచే దాటుకుంటూ వెళ్తారు. ఉన్నట్టుండి నదిపొంగి జనం కొట్టుకుపోవటం కూడా జరుగుతూఉంటుంది. అందుకే 'పెన్నదాటితే కదా పెరుమాళ్ళసేవ' అని సామెతగా చెప్పుకుంటారు. పెన్నదాటిన తరువాత ప్రసిద్ధిచెందిన దేవాలయమొకటి ఉన్నది. ఆ దేవుడిపేరు రంగనాయకులు. ఆ స్వామికి ఉయ్యాల సేవచేయటానికి దేవాలయము పక్కగా పెద్ద అద్దాలమండపమున్నది. లోపల గోడలకు కప్పుకూ అద్దాలు అమర్చారు. ఆ స్వామిని అమ్మవారిని పూలపాన్పుమీద పరుండబెట్టి ఊపుతారు. అన్ని అద్దాల గుండా స్వామి కనబడుతు ఉంటాడు. ఆ దృశ్యం చూడటానికి వందలాది జనం వస్తారు. ముందుగా ఈ కథంతా చెప్పి ప్రిన్సిపల్ ప్రొఫెసర్‌ని దేవాలయంలోకి తీసుకువెళ్ళాడు. దాదాపు పన్నెండడుగుల విగ్రహం, స్వామివారు పడుకుని ఉన్నట్టుగా ఉంది. చుట్టూ దేవేరులు, దేవతలు ఋషుల విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. ఆ విగ్రహాన్ని గోడమీద చెక్కిన శిల్పాలను చూసి ప్రొఫెసరు ఆశ్చర్యపడి ఫోటోతీసుకున్నాడు. బయటికి రాగానే దేవాలయంచుట్టూ చెక్కిన శిల్పాలనుచూసి కెమెరాతో ఫొటోలను తీసుకున్నాడు. అద్దాల మండపం చూసి విస్మయంతో "ఇటువంటిది నేనెక్కడా చూడలేదు" అంటూ దాని ఫోటోకూడా తీసుకున్నాడు.

దేవాలయ గోపురంమీద అన్నీ బొమ్మలే. వాటిని చూపి "ఆ బొమ్మలు ఏవో కథలు చెబుతున్నట్టుగా చెక్కబడ్డాయి. ఆ కథలు ఏమిటి!" అడిగాడు. "అవి పౌరాణిక గాథలు, లోపల ఉన్న స్వామివారికి సంబంధించినవి" అంటూ దేవాలయం నాలుగు మూలలూ చూపించి, కోనేరు దానిలోకి దిగటానికి మెట్లూ అన్నీ వివరాలతోసహా చెప్పాడు ప్రిన్సిపల్.

ప్రొఫెసరు తాను దిగిన హోటల్‌కి వెళ్ళిపోయాడు. ఆయన కారెక్కుతూ ఉండగా ప్రిన్సిపల్ "మా కాలేజిలో మీ గౌరవార్థం ఒక సమావేశం ఏర్పాటు చేస్తాను, మీరు తప్పక రావాలి" అని ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

"తప్పక వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు ఆయన.

ఆ మరునాడే పెద్ద సమావేశము ఏర్పాటయింది. కాలేజిస్టాఫ్, విద్యార్థులు పురజనులు అధికారులు ప్రొఫెసర్‌ను చూడటానికే వచ్చారు.

ఎప్పటి మాదిరిగా ప్రార్థన దండకంతో ప్రారంభించాడు విశ్వనాథం. ఆ దండకం సంస్కృత సమావేశాలతో భక్త్యుద్రేకంతో దేవిని ప్రార్థించేది. ఉచ్చైస్వరంతో అతడు గుక్కతిప్పకుండా ప్రతిపాదంచివర ఆపి, రాగయుక్తంగా మళ్ళీ ప్రారంభించటం, దానిని ముగింపురాగముతో ముగించటం ఆ విదేశీయుణ్ణి సంభ్రమంలో ముంచెత్తింది. అందులో అతడి కంఠం తీగెలుసాగినట్టు సాగి విజృంభిస్తోంది. ప్రొఫెసరు తన్మయుడయ్యాడు.

సమావేశం పూర్తికాగానే ప్రొఫెసర్ "ఫెంటాస్టిక్, ఆ అబ్బాయిని పిలిచి పరిచయం చేయుము'' అడిగాడు. విశ్వానాథం రాగానే తన రెండుచేతులు అతడి భుజాలమీద వేసి "ఇంత అద్భుతమైన గానం నేనెక్కడా వినలేదు" అని అతడిని మెచ్చుకున్నాడు.

ప్రిన్సిపల్‌ని పిలిచి విశ్వనాథం యొక్క వివరాలన్నీ అడిగి తీసుకుని, ఇతడికి గొప్ప భవిష్యత్తు ఉన్నది. ఇతడిని మా దేశానికి తీసుకువెళ్ళి అక్కడి వారందరికీ ఈ మధురగానం వినిపించేటట్టు చేస్తాను. ఆ దేశాలన్నీ తిప్పుతాను'' అన్నాడు.

ప్రిన్సిపల్ ప్రొఫెసరు కోరికమీద మరునాడు అతడి పాటలకోసమే కాలేజి హాల్లో సమావేశమేర్పరచాడు.

విశ్వనాథం మొదట తన గురువులకు నమస్కరించి తంబూరాను కళ్ళకద్దుకుని క్షీరసాగర శయనా అంటూ ఆరోహణ అవరోహణలతో చిట్టిస్వరాలతో నాలుగు కీర్తనలు భక్తి రసాన్ని ఒలికించేవాటిని గానం చేశాడు.

''నేను ఉత్తరభారతం చూసి, దక్షిణాన కూడా దేవాలయాలు, గోపురాలు, వాటిమీది శిల్పాలు చూసి ఫోటోలుతీసుకున్నాను. ఇక్కడి నుంచి మదరాసువెళ్ళి ఆ చుట్టుపక్కలవి కూడా చూసుకుని మదరాసునుంచి టెలిగ్రామ్ ఇస్తాను. అబ్బాయిని వాళ్ళ వాళ్ళను అడిగి తెలుసుకుని నా ఎడ్రసుకు పంపించండి'' అని సంతోషాతిరేకంతో ''విశ్వనాథంయొక్క సంగీతాన్ని మరువలేకుండా ఉన్నాని చెప్పాడు.

విశ్వనాథాన్ని పిలిచి ఆ సంగతే మళ్ళీచెప్పి టెలిగ్రామ్ చూసుకుని రమ్మన్నాడు.

విశ్వనాథం మనసంతా ఆనందంతో నిండిపోయింది. నోటిమాటరాక తల ఊపాడు. స్టేషన్‌వరకూ వెళ్ళి ప్రొఫెసర్‌ని రైలెక్కించాడు.

ఇంటికి వెళ్ళగానే బామ్మ ''ఏమిరా ఇంత ఆలస్యంచేశావు ?" అడిగింది.

''విదేశాల నుంచి ఒక ప్రొఫెసరు వచ్చాడు. కాలేజిలో పెద్ద సమావేశం జరిగింది. పాటలు పాడమంటే పాడాను. ఆయన మదరాసువెళ్తుంటే స్టేషన్‌కి వెళ్ళి రైలెక్కించి వస్తున్నా" అన్నాడు.

"నీకు పాటలు వచ్చా ? ఎప్పుడు నేర్చావురా ? ఎవరిదగ్గర ?'' ఆమెకు ఆశ్చర్యంగా ఉంది. "విదేశీయుల ముందర ప్రిన్సిపల్‌గారు పాడించేటంతటి పాటలు వీడెప్పుడు నేర్చాడు ?'' అని విస్మయంతో అతడి తలను గుండెకానించుకుంది.

"మన పక్కింటాయనకు నీవు కూరలు సాంబారూ నాచేత పంపేదానివిగా! ఆయన నేర్పించాడు. మొత్తం పన్నెండేళ్ళపైన, నన్ను ఎక్కడికయిన తీసుకుపోయి పాటకచేరీలు కూడా చేయించారు."

"ఆయనకేమిచ్చావురా ఫీజుకింద ?"

''బామ్మా, ఆయనకు నాసంగతి తెలియదా ? అప్పుడు నాదగ్గర డబ్బు లేదుకదా ?" ఆయనకు నీవు పంపిన సాధకాలే ఫీజు. నేను ఆయనను నిద్రలేవగానే తలుచుకుని దణ్ణంపెడతాను ప్రతిరోజు. రాత్రిళ్ళు ఆయనను తలుచుకుంటూ నిద్రపోతను, అదే నా గురుదక్షిణ. ఆయన వాళ్ళ ఊరువెళ్ళి చనిపోయారు. ఆ రోజున స్నానంచేసి గుడికి వెళ్ళి నా జేబులో ట్యూషన్ పిల్లలు ఇచ్చిన ఫీజు హుండీలో వేశాను. బామ్మా! భక్తితో సమర్పించింది గురుదక్షిణకాదా?" అన్నాడు.

"పిచ్చినాయనా, కొండంత దేవుడికి కొండంతపత్రితో పూజచేయగలమా? భక్తి ప్రధానం. భోజనానికి రా".

ఆ రాత్రి అతడికి "బామ్మ తనను పోనిస్తుందా ? తను వెళ్ళితే బామ్మనెవరు చూస్తారు ?" అన్న ఆలోచనలు నిద్రపోనివ్వలేదు.

తెల్లవారి ''బామ్మా తీర్థయాత్రలు చేస్తావా ? టూరిస్టుబస్సు రెండురోజుల్లో బయలు దేరుతుందట. దక్షిణదేశంలో ఉన్న పుణ్యతీర్థాలకు తీసుకువెళ్ళి జాగ్రత్తగా తీసుకువచ్చి దింపుతారు. వెళ్తావా ? మళ్ళీ ఈ అవకాశం రావద్దూ?'' అన్నాడు ఆమె పక్కన కూర్చుని.

''అలాగా ? నాకూ చూడాలనీ వెళ్ళాలనీ ఉంది గాని బాబూ, డబ్బేదిరా?'' అంది.

''బామ్మా నేను పెద్దవాణ్ణయ్యానుగా ? ఆ సంగతి నాకు వదిలెయ్యి. నీవు వెళ్ళి అన్నీచూసి సుఖంగా ఇంటికిరా. తరువాత నీకు శ్రీశైలంచూడాలని ఉందన్నావుగా, నీవు రాగానే అక్కడ ఒక చిన్న క్వార్టరు తీసుకుని నిన్నందులో ఉంచుతా. నీకు తోడు కావాలంటే అక్కడే ఎవరైనా దొరుకుతారు. రోజూ నదీ జలాలలో స్నానంచేసి దైవదర్శనం చేసుకుని వంటచేసుకుని భోజనం చెయ్యి. కాకపోయినా అక్కడ సత్రముంది. డబ్బిచ్చినా ఇవ్వకపోయినా భోజంపెడతారు. ఇబ్బంది లేదు'' అన్నాడు ఆమె మెడచుట్టూ చెయ్యివేసి.

''నాన్న నన్ను వెళ్ళనియ్యద్దూ"

"ఎందుకు వెళ్ళనీయడు ? నీవు ఆయననుచూసి అసలు ఎన్నాళ్ళయింది ? నీవాక లెక్కా ఆయనకు ? సిద్ధంగా ఉండు వెళ్ళటానికి'' కొంచెం కఠినంగా అన్నాడు.

విశ్వనాథం బజారుకెళ్ళి బామ్మకు పట్టుబట్ట ఒక చిన్న పెట్టె కొనుక్కొచ్చాడు. ఆమెకు కావలసిన డబ్బు కొంత చేతిలోపెట్టి బస్సుకు కావలసింది గుమస్తాకు కట్టేశాడు. బస్సు బయలుదేరేనాడు గంటముందర అక్కడికి తీసుకు వెళ్లాడు.

“ఎంతవాడ వయ్యావురా తండ్రీ" అతడిని కౌగలించుకుని కన్నీళ్ళు పెట్టుకుంది.

బామ్మను పంపించిన తరువాత ఇంటికివచ్చి తీర్థయాత్ర సంగతి చెప్పగానే "ఆ డబ్బు ఉంటే మనకో నెల్లాళ్ళకు పైగా గడిచేది'' అన్నాడు తండ్రి.

''డబ్బుదేమిటి ? ఎంత ఉన్నా చాలదు. ఆమెను తీర్థయాత్రలు చేసి తృప్తిగా జీవితం గడపనీయండి'' అన్నాడు విశ్వనాథం.

తనతో కొడుకు ఇట్లా మాట్లాడటం ఇదే మొదటిసారి. అయినా వీడికింత డబ్బు ఎక్కడిది ? బిచ్చమడుగుతున్నాడా !

విశ్వనాథం మాట్లాడకుండా వెనక్కు తిరిగాడు. ఉన్నప్పుడు "తిన్నావా బాగున్నావా ?'' అని అడిగాడా ? ట్యూషన్లమీద నెలకు అయిదారు వందలు సంపాదిస్తాడు. తల్లీ తన కొడుకు పూరిపాకలో ఉండగా సగంఇల్లు అద్దెకు ఇచ్చాడు. ఇంటి స్థలంలో సగం కట్టెల అడితెకిచ్చాడు అద్దెకు. డబ్బుకు పరిమితి ఎక్కడిది?

కన్న తల్లినే పట్టించుకోని వాడికి ఇంకా తన సంగతి చెప్పటమెందుకు ? తల్లి లేకపోతే తండ్రి పినతండ్రితో సమానం అంటారు. ! ఇంకా వాళ్ళేనయ మేమో ?

ప్రొఫెసరు దగ్గరనుంచి టెలిగ్రామ్ వచ్చేలోపల బామ్మ పది రోజులలో దక్షిణదేశయాత్రలుచేసి వచ్చింది. ఈలోగా విశ్వనాథం ఆమెకు శ్రీశైలంలో అన్ని ఏర్పాట్లుచేసి ఆమె బస్సు దిగగానే అటునుంచిఅటే తీసుకువెళ్ళాడు. అక్కడ తన కోసం తీసుకున్న చిన్న క్వార్టర్సుచూసి ఆమె సంతోషించింది. ఆమెకు ఒకతోడు దొరికింది. సత్రం గుమాస్తా డబ్బుఇస్తే భోజనం ఏర్పాట్లుచేస్తానన్నాడు. విశ్వనాథం బామ్మచేతికి కొంతడబ్బుఇచ్చి మిగిలినది ఆమెపేరున బేంకులోవేశాడు. బామ్మకు అంతా తృప్తిగాఉంది, కన్నీళ్ళతో విశ్వనాథాన్ని పంపించింది.

విశ్వనాథంరాగానే ప్రిన్సిపల్ దగ్గరికివెళ్ళాడు.

''ఎక్కడికెళ్ళావోయ్? ప్రొఫెసరుగారు నిన్ను మదరాసు ఈ ఎడ్రసుకు రమ్మని టెలిగ్రామూ, నీవురావటానికి డబ్బుపంపారు. ఈ సాయంత్రం బయలు దేరు అన్నట్లు మీవాళ్ళకుచెప్పావా'' అడిగాడు.

''బయలుదేరుతానుసర్. నా ఈభవిష్యత్తులో మీకూ భాగంఉంది. నన్ను ఇంతవరకూ అభిమానంతోచూశారు. ఎన్నో అవకాశాలు కల్పించారు. కృతజ్ఞణ్ణి'' అంటూ పాదాభివందనంచేసి స్టేషన్‌కి వెళ్ళాడు.

విశ్వనాథానికి ప్రొఫెసర్ ఎడ్రసు తెలుసుకోవటానికి ఎక్కువకష్టం కలగ

లేదు. ఆయన ఒక హోటల్లోదిగాడు. విశ్వనాథానికి ఫోటోతీయించి తమ స్పాన్సర్ చేస్తున్నట్టుగా వీసా తీసుకున్నాడు.

ప్రొఫెసర్ ఉండటం లాసేంజల్సులో. అతడిని తన యింటికి తీసుకు వెళ్ళాడు గెస్టుగా ఉండమన్నాడు.

''విశ్వనాథం నేను బైటకాంటీన్‌లో భోజనంచేస్తాను. మరినీవు? నాతోకూడా వస్తావా కాంటీన్‌కి'' అడిగాడు.

ప్రొఫెసర్‌ని ఇబ్బంది పెట్టటమెందుకని ''వస్తానుసర్'' అన్నాడు.

రెండురోజులయిన తరువాత "నాకువంటచేసుకోవటం వచ్చుసర్. సామగ్రి తెచ్చుకుని నేను వంటచేసుకుంటాను తక్కువలో గడిచిపోతుంది" అన్నాడు.

ప్రొఫెసర్ గ్రహించాడు అతడి ఉద్దేశాన్ని, విశ్వనాథం పూర్తిగా శాకాహారి. అతడిని తనతో కారులో తీసుకువెళ్ళి సామాన్లుకొన్నాడు. విశ్వనాథానికి తన యింట్లో ఉన్న గది ఒకటి ఉండటానికిఇచ్చాడు. వంటచేసుకోవటానికి ఏర్పాట్లు చేశాడు.

ఈలోపల ప్రొఫెసరు విశ్వనాథానికి తెలుగువారున్న రెండు మూడు ఊళ్ళలో ప్రోగ్రామ్‌లు ఏర్పాటుచేయించాడు మిత్రులద్వారా. ఆ ప్రోగ్రాములు విన్న వాళ్ళు అతడి నెంతో గౌరవించి ''రెండు మూడు నెలల కొక ప్రోగ్రామ్ఇవ్వండి మా ఊరువచ్చి'' అని ఘనంగా సన్మానించారు డాలర్లతో.

ప్రొఫెసరు ఇల్లు పెద్దది. స్వంతంగా ఏరికోరి కొనుక్కున్నాడు చుట్టుతోట, చూడటానికి అందమైనఇల్లు. అతడు కుటుంబంతో ఉండేవాడు కనుక అన్ని హంగులూఉన్నాయి యింట్లో. విశ్వనాథం ఉదయంలేచి ప్రొఫెసిర్‌కి తనకూ కాఫీ చేసేవాడు. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటు కాఫీ తాగేవారు. ప్రొఫెసరు తనపని మీద బైటికి వెళ్ళగానే విశ్వనాథం తన వంటచేసుకునేవాడు. పాటలు ప్రాక్టీసు చేసుకునేవాడు భోజనంచేసి ప్రొఫెసర్ లైబ్రరీలో కూర్చుని చదువుకునేవాడు. కొంతసేపు టి.వి. చూసేవాడు.

తెలుగువాళ్ళుఉన్నచోటికల్లా అతడికి ఆహ్వానాలువచ్చేవి. పాటకచేరీ చెయ్యమని. వాళ్ళు డాలర్లతో సన్మానించేవారు. ప్రొఫెసరుకూడావెళ్ళి ఆ కీర్తనలు వింటూ

ఉండేవాడు. "కస్తూరీతిలకం లలాటఫలకే" ఆ శ్లోకాన్ని విని తన్మయుడైయ్యేవాడు. ఇంటికివచ్చిన తరువాత దాని అర్థంచెప్పించుకునేవాడు.

ఒక రోజు విశ్వనాథం ''సర్ నాకేదయనా ఉద్యోగమిప్పించండి. పగలు కొంత టైమ్ వృధాగా పోతున్నది'' అని అడిగాడు.

''నీవు బి. ఏ. ప్యాసయ్యావుకదా. ఏదైనా నీ ఇష్టమువచ్చిన కోర్సులోచేరి చదువుకో. నీకు ఎక్కడైనా ఉద్యోగం దొరుకుతుంది'' అని ఒక డాక్టరు దగ్గర సెక్రెటరీ ఉద్యోగమిప్పించాడు.

చదువుకుంటూ పాటలు ప్రాక్టీసుచేసుకుంటూ ఉద్యోగము చేస్తున్న విశ్వనాథం ఒకనాడు ఒక సూట్ కొనుక్కుని వచ్చాడు.

ప్రొఫెసరు ఇంటికిరాగానే ఆయనకా సూటుయిచ్చి పాదాభివందనంచేశాడు. "సర్ మీరిది ధరించాలి" అని వినయంతో అడిగాడు.

ఆయన ఆశ్చర్యపడి "ఏమిటిది?" అన్నాడు.

''మా దేశంలో మొదటిజీతంరాగానే పెద్దలకు బట్టలుబహూకరించి పాదాభివందనచేసే ఆచారంఉన్నది. మీరు పెద్దలు. నా హితముకోరి నన్నింతవరకూ తీసుకొచ్చినవారు మీరు నాకు తండ్రివంటివారు. అందుకని తీసుకొచ్చాన''న్నాడు.

ప్రొఫెసర్‌కి పిల్లలులేరు. ఇద్దరు భార్యలు డైవోర్సుచేసి వెళ్ళిపోయారు. ఆయన ఒంటరిగాడు. విశ్వనాథం వచ్చినప్పటినుంచీ ఆయనకెంతో సంతోషంగా ఉంది. ఇంట్లో ఉన్నంత సేపూ ఆయన అవసరాలు తెలుసుకుని అందిస్తాడు. ఆయన బట్టలు లాండ్రీకివ్వటం, తీసుకురావటం బూట్లు పాలిష్ చెయ్యటం, చిన్న చిన్న వస్తువులు అందివ్వటం, ఆయన వెంటవెంటతిరగటం పేపరుచదివి వినిపించటం వంటపనులు చేస్తున్నాడు ఇవన్నీ అతడు మర్యాదకోసమని లేక-మనసారా చేస్తున్నాడు తండ్రికి చేసినట్టు. అతడిని తన తండ్రిస్థానంలో నిలుపుకున్నాడు. తండ్రిని సేవించినట్లు సేవిస్తున్నాడు.

ప్రొఫెసరుకెంతహాయిగా ఉందని? ఇదివరలో బిక్కుబిక్కుమంటూ పలకరించే వాళ్ళులేక ఇంటికిరాగానే దిగాలుపడి సోఫాలోకూర్చునేవాడు. ఇపుడలాకాదు. వింతసందడిగాఉంది? ఆప్యాయతతో ఆత్మీయుడు పలకరించినట్లు పలకరించి తనకుతోడుగా ఉన్నాడు విశ్వనాథం.

సెక్రెటరీగా సంపాదించినదీ సంగీత కార్యక్రమాలలో సంపాదించినదీ డబ్బు ఏడు ఎనిమిది వందల డాలర్లు పోగవగానే ''వీటి నేంచెయ్యాలి?'' అని ప్రొఫెసర్‌ని అడిగాడు. బ్యాంకులో ఎకౌంటు పెట్టుమని సలహాఇచ్చాడు.

విశ్వనాథానికి రోజులు హాయిగా గడిచిపోతున్నాయి.

ఆ నాడు ఉదయం ప్రొఫెసరూ తను కాఫీ తీసుకునేటప్పుడు అతడి కళ్ళు ఎర్రగా ఉన్నట్టు కనబడ్డాయి ప్రొఫెసర్‌కి.

ప్రొఫెసర్ మనసు ఆందోళనచెందింది. అతడికి విశ్వనాథమని పిలవటానికి కష్టంగాఉండి రామ్ అనిపిలిచేవాడు.

''రామ్ అట్లాఉన్నావేం? నీ కళ్ళను అద్దంలోచూసుకో. ముఖంకూడా పీక్కుపోయినట్టుంది జర్వంవచ్చిందా?'' ఆదుర్దాతో అడిగాడు.

"జ్వరంకాదుసర్. మా బామ్మ కలలోకివచ్చి నన్ను ఒకసారి రమ్మని పిలిచింది. బామ్మ ఒక్కతే నన్ను తలుచుకునేది.''

''అయితే వెళ్లిచూసిరా. సాయంత్రతటికెట్ కొనుక్కునివస్తాను. డాక్టరికి ఫోనుచెయ్యి ఊరికి వెళ్ళుతున్నానని నీకు పర్మినెంటు వీసాకష్టపడి తీసుకున్నాను. టికెట్ మీద తేదీచూసుకుని బయలుదేరు'' అన్నాడు.

"సరేసర్"

''నీకు ఎన్నిసార్లో చెప్పాలనుకున్నాను. నన్నుసర్ అంటూపిలవకు నన్ను అంకుల్ అని పిలు. డాడీ అంటే ఇంకా సంతోషిస్తాను. నిన్ను ఒక బామ్మేనా ప్రేమగాచూసేది? మరినేనో?'' అన్నాడు. ఆ మాటలనేటప్పుడు అతడికళ్ళు తడితో మెరిశాయి. ఆశగాచూస్తున్నట్టున్నాయి.

విశ్వనాథం లేచి అతడిమెడను చేతులతో చుట్టేశాడు. "ఈయనే నా తండ్రి ఈయనే నాతండ్రి-కన్న తండ్రి" అని గుండె టకటక కొట్టుకున్నది ఘోషించినట్టు.

ఇద్దరి కళ్ళల్లోను కన్నీళ్ళు. అవి ఆనందబాష్పాలేమో? వాళ్ళకేంతెలుసు ఆ సంగతి?

కళ్లు తుడుచుకుంటూ "వెల్ మై బాయ్" అన్నాడు ప్రొఫెసరు.

"వెల్ మైడియర్ డాడీ" అన్నాడు విశ్వనాథం ఆయన పాదాలు స్పృశిస్తూ.

విశ్వనాథం పెల్లటి తెలుపు, నల్లటి నొక్కుల క్రాప్‌తో కొట్టవచ్చినట్టు కనబడతాడు. అతడి నవ్వు అందాలనొలకపోస్తుంది. ప్రొఫెసర్ దేహచ్ఛాయ కూడా తెలుపే. కాని ఆ తెలుపులో ఎరుపుకలిసినట్టుంటుంది. ప్రొఫెసరు ఆరడుగుల పైన పొడుగున్నట్టు కనబడతాడు. విశ్వనాథం అంత పొడుగుండడు. ప్రొఫెసర్ తలవెంట్రుకలు ఎరుపూ తెలుపూ కాకుండా ఉంటాయి.

ఎట్లాగయినా విదేశీయుల అందం వేరు, భారతీయుల అందం వేరు.

విశ్వనాథం వెళ్ళిన వారానికే తిరిగి వచ్చాడు దిక్కుముఖంతో.

''ఏమిటలా ఉన్నావు? ఆరోగ్యం బాగుందా ?'' ప్రొఫెసరు ఎదురుగావచ్చి ఇంట్లోకి నడిపించుకుంటూ వెళ్ళాడు.

"బామ్మ........బామ్మ నదిలో స్నానం చేస్తూ కొట్టుకుపోయిందట. శవం కూడా దొరకలేదట. నేను బామ్మను చూడలేకపోయాను'' అని వెక్కివెక్కి ఏడ్చాడు.

ప్రొఫెసర్ అతడిని గుండెకు హత్తుకుని ''రామ్, ఆమె పెద్దదయింది కదా. అందరూ అట్లా పోవలసినవాళ్ళమే, బాధపడకు మైడియర్. మర్చిపోవటానికి ప్రయత్నించు'' అని ఓదార్చాడు.

''నేను నీతో భోజనం చేస్తాను. నీవు ఏంపెడితే అదే తింటాను. నీకోసం కూరలు ఫ్రిజ్‌లో ఉన్నాయిచూడు. పాలు పెరుగు నేను తెస్తాను'' మరి నీవు సంతోషంగా ఉండాలి. ఏడవకూడదు'' అంటూ కారులో వెళ్ళి, పాలు పెరుగు మరికొన్ని కూరలు తెచ్చాడు ప్రొఫెసరు.

విశ్వనాథం కారం ఎక్కువలేకుండా ఉర్లగడ్డకూరచేసి సాంబారుచేసి వేళకు టేబల్‌మీద అన్నీ అమర్చాడు. ప్రొఫెసరు ''నీ వంట బాగుందని'' తిన్నాడు.

ఆ మరునాడు టెక్సాస్‌లో విశ్వనాథానికి సంగీతప్రోగ్రాం ఉంది. తండ్రి మాదిరిగా పక్కన కూర్చోబెట్టుకుని స్వయంగా తీసుకెళ్ళాడు ప్రొఫెసరు.

కస్తూరీ తిలకంతో ప్రార్థనచేసి గీత గోవిందం శ్లోకాలు చదివాడు - ప్రేక్షకులు పులకించిపోయేటట్టుగా. ఆ కార్యక్రమం పూర్తికాక ముందే ఒక కుందనం బొమ్మలాంటి అమ్మాయి లేచి వచ్చి రాధామాధవ లీలలను గురించిన శ్లోకాలు చదివింది.

"ప్రేక్షకులంతా ఇద్దరూ ఎట్లా ఉన్నారో ఈడూజోడుగా" అనుకున్నారు.

ప్రొఫెసరుకు కూడా అమాటే తోచింది. మరునాడు ఫోనుచేసి వివరాలు తెప్పించాడు. ''రామ్, నేను చెప్పినట్టు వింటావా ?'' అన్నాడు.

''ఏమిటిసర్" అనబోయి తనకు తానే దిద్దుకుని "ఏమిటి డాడీ"? అన్నాడు.

"మైడీయర్ సన్, నీకు పెళ్ళిచేస్తాను. నీకు తగిన అమ్మాయి, చూడు నిన్ను కవ్విస్తూ పాటలు పాడింది ?'' అన్నాడు.

విశ్వనాథం వద్దనలేదు. ''యాజ్ యూ ప్లీజ్" అన్నాడు.

అమ్మాయి భారతీయ కన్య. దేవాలయంలో మంత్రాలతో భారతీయ ఆచారాలతో వివాహం జరిగింది.

అమ్మాయి పేరు వసుధ. ఇక్కడికి వచ్చినప్పటినుంచీ అంకుల్ అంకుల్ అంటూ ప్రొఫెసరుతో ''నేను మీకు నచ్చినట్టు వంటచేస్తాను. బ్రేక్‌ఫాస్టు తయారు చేస్తాను. రాత్రికి మీకు ఏది కావాలంటే దానిని తయారు చేస్తాను" ఆయనను ఒప్పించి వంటపని చార్జి తాను తీసుకుంది.

''మరినాకేం మిగిల్చావు ?'' అన్నాడు విశ్వనాథం.

''నువ్వా? ఇంటిపనంతా చెయ్యి. నేను పెట్టింది తిను. నీ ఉద్యోగం సంగతి నీవు చూసుకో. నా ఉద్యోగం సంగతి నేను చూసుకుంటాను. నేను మూడింటికే ఇంటికి వస్తాను నీకంటె ముందుగా'' అన్నది

ప్రొఫెసర్ వసూ అని పిలవటం నేర్చుకున్నాడు. వాళ్ళిద్దరినీ చూసి ఉబ్బితబ్బిబ్బయిపోతున్నాడు.

వాన జల్లులా పూలజల్లులా గల గల నవ్వుల జల్లు నాలుగు గంటలనుంచీ

ఇంట్లొ వినబడుతూ ఉంటుంది. వసుధ చేసిన సౌత్ ఇండియన్ వంటను తెగ మెచ్చుకుంటున్నాడు ప్రొఫెసరు.

ఆయనకి జీవితం చాలా కొత్తగా స్వర్గంలో ఉన్నట్టుగా ఉంది. ఆ ఆప్యాయత, ఆ ప్రేమ పాపమాతడు పుట్టినప్పటినుంచీ ఎరుగడు. ఎక్కడో అనాథశరణాలయంలో పెరిగాడు. చదువుకుంటూ ఉద్యోగం చేస్తూ ఇంతవాడయ్యాడు. డబ్బెంత ఉంటేనేమి? ఆ భార్యలు ఒకరుకాకపోతే ఒకరయినా ఇంత అప్యాయంగ పలకరించేవారా ? ఎప్పుడు వచ్చేవారో ? ఎప్పుడు వెళ్ళేవాళ్ళో అతడికి తెలియదు. అలా ఆ జీవితం వాళ్ళిద్దరితో యాంత్రికంగా గడిచిపోయింది.

వసుధ తనకు కావలసినవన్నీ అమర్చి ''అంకుల్, నేను వెళ్ళి పడుకోనా ?'' అని అడుగుతుంది. ఆ మాటకు ప్రొఫెసర్ కరిగిపోతాడు.

"డాడీ, ఇంకపడుకోండి. గుడ్‌నైట్'' అంటు ఆమె వెనుక రామ్‌వస్తాడు.

''మీ యిద్దర్నీ చూస్తుంటే నాకు సంతోషంతో నిద్ర పట్టటం లేదు'' అన్నాడు.

''అలాగా ! మీకు పదినిమిషాలలో నిద్రవచ్చేటట్టు చేస్తాను" అంటూ ప్రొఫెసరు మంచమ్మీద కూర్చుని ఆయన వీపుమీద చెయ్యివేసిరాస్తూ జోలపాట మెల్లగా పాడటం మొదలుపెట్టాడు.

ప్రొఫెసర్‌కి ఎప్పుడు కళ్ళు మూతలు పడ్డాయో ఆయనకు తెలియదు.

ప్రొఫెసర్‌కి ఒకనాడు జలుబుచేసి ఒళ్ళు భారంగా ఉన్నట్లనిపించి ఇంట్లోనే ఉండిపోయాడు. రామ్ వసుధ ఇద్దరూ సెలవుపెట్టి ఆయన దగ్గరే ఉండిపోయారు.

"మీకెప్పుడయినా ఇట్లా వచ్చిందా డాడీ" అని అడిగాడు రామ్.

"ఎప్పుడో ఏడాదికోసారి వస్తుంది.''

''ఇలా వచ్చినప్పుడు మీరు ఏదయినా మందు తీసుకుంటారా?''

''మందులు- అవే, ఏవో మాత్రలు వాడతాను. ఈ మధ్య రాలేదు. అందుకని మందుకొని ఉంచుకోవటం అశ్రద్ధ చేశాను."

''ఆ మందు పేరేమిటి ?''

''రాత్రి పదిగంటలయింది. ఇప్పుడేం తెస్తావు ? రేపు చూసుకుందాంలే'' అన్నాడు.

''నేను వెళ్ళి తెస్తాను. లేకపోతే తెల్లవార్లూ బాధపడతారు'' అని పేరు రాయించుకుని తన కారులోవెళ్ళి తెచ్చాడు. అంతవరకూ వసుధ ఆయన దగ్గర యూకలిప్టస్ ఆయిల్ తన దగ్గరున్నది రాస్తూ కూర్చుంది.

"బాధగా ఉంతి గాని ఇదివరకంత లేదు వసూ. ఎందుకో తెలుసా ?'' అడిగాడు.

"ఎందుకని ?''

''సగం బాధ మీయిద్దరి పరిచర్యతో తగ్గినట్టుంది."

ఇలా వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ ఉండగా రామ్ వచ్చాడు మందుకొనుక్కుని. ఆయనకు ఒక టాబ్లెట్ యిచ్చి కొంచెం మంచినీళ్ళిచ్చాడు.

ఆయన మంచం దగ్గర ఇద్దరూ కుర్చీలు వేసుకుని కూర్చున్నారు-ఆయన వంకే చూస్తూ.

ప్రొఫెసర్‌కి ఎప్పుడో నిద్రపట్టింది.

వాళ్ళిద్దరూ లేచి వెళ్ళారు.

తెల్లవారాగానే కాఫీ బ్రెక్‌ఫాస్టుతో మంచందగ్గరకే వచ్చింది వసుధ.

"వచ్చావా ? ఇక్కడికెందుకు తెచ్చావు ? నేను వచ్చేవాణ్ణిగా డైనింగ్ హాల్లోకి ?'' అని మురిపెంతో ఆమెను చూస్తూ అన్నాడు.

''బాధవల్ల మీకు బలహీనంగా ఉండచ్చునని నేనే తెచ్చాను, తీసుకోండి.''

"రామ్ లేచాడా ?''

"ఆఁ, లేచి మీకు బ్రెక్‌ఫాస్టు తనే తెస్తానన్నాడు. నేను అతడి చేతిలోనుంచి లాక్కొచ్చాను. పాపం, ఓడిపోయాడు'' నవ్వింది పకపకా.

ప్రొఫెసర్‌కి ఆశ్చర్యం, ఆనందం పందేలు వేసుకున్నట్టుగా ముఖమ్మీద చిందులాడాయి.

వీళ్ళిద్దరూ తనకెన్ని కొత్త కొత్త విషయాలు వినిపిస్తున్నారు ? చూపిస్తున్నారు ? ఇంతటిహాయి నాజీవితాంతం లభిస్తే ఎంతబాగుంటుంది ?

రెండు రోజులలో ప్రొఫెసరు మామూలుమనిషి అయ్యాడు. అయినా ఆనాడుకూడా రెస్టు తీసుకోమని బలవంతంచేసి ఇద్దరూ సెలవుపెట్టి ఇంట్లోనే ఉన్నారు.

మధ్యాహ్నం టీ తాగేటప్పుడు ప్రొఫెసరు ఒక విల్లురాసి వాళ్ళ చేతిలో పెట్టాడు. లక్షలు విలువచేసే ఆ యిల్లు వసుధకు, ఎనభై వేల డాలర్లు రామ్‌కి చెందాలని ఉంది దానిలో. ''మీరిద్దరూ విడిపోకుండా ఈ యింట్లోనే ఇట్లాగే ఉండాలి'' అన్నాడు వాళ్ళ ముఖాలకేసి చూస్తూ.

ఇద్దరూ విస్తుపోయారు.

''మీరిద్దరూ ఇట్లాగే నాదగ్గర ఉండిపోవాలి. నాకిటువంటి కోరిక ఎన్నడూ కలగలేదు కాని, మిమ్మల్నిచూసిన తరువాత ఒక చిన్న కోరిక, నేను కలలో కూడా ఊహించని కోరిక అది, తీరుస్తారా ?'' అడిగాడు.

"డాడీ, మీరడగటం మేము తీర్చకపోవటం అనేది జరగనే జరగదు. ఏమిటో చెప్పండి. ఇక్కడే మీ దగ్గర ఉండమన్నారు. మీకంటె మాకు ఆప్తులెవరున్నారు ? మీకు సేవచేస్తూ ఇక్కడే ఉంటాము మరింకో కోరిక ఏమిటి ?" అన్నాడు రామ్.

''ఇంకో కోరిక చెప్తే తీరుస్తారా ?"

''తప్పకుండా.''

''నాకొక గ్రాండ్ సన్ కావాలి. వాడితో నేను ఆడుకుంటా తోటంతా తిరగాలి. చక్రాలబండిలో నేనే తిప్పుతాను తోటంతా.''

ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు వసుధ రామ్‌లు.

"దానికేం భాగ్యం డాడీ, ఇంకో మూడునెలల్లో వచ్చేస్తాడు మీతో ఆడుకోవటానికి'' అన్నాడు రామ్ వసుధ వంకచూస్తూ.

"అయితే వాడిని చూసుకుంటూ నన్ను మరిచిపోరుకద?'' అన్నాడు కొద్దిగా అనుమానం కలిగి.

ఇది సింపుల్ ప్రాబ్లమ్. బేబీని మీరుచూడండి, మిమ్మల్ని మేమిద్దరం కని పెట్టి చూస్తాం'' అన్నారు నవ్వుతూ.

ఇల్లెగిరి పోయేటట్టు మురిసిపోతూ నవ్వాడు ప్రొఫెసరు.

ఆ ముగ్గురి నవ్వులతో ఆ యింట్లో కొత్త వెలుగు ప్రసరించినట్లయింది.